

రుణమాఫీ కోసం రోడ్డెక్కిన అన్నదాతలు 8లో..
శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరపాలి 7లో..

వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు


- ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ఏడు నెలలుగా అందని జీతాలు
- పంచాయతీ సెక్రెటరీలు, జూనియర్ పంచాయతీ సెక్రెటరీలకు సమానంగా విధులు
- పనికి తగ్గ వేతనాలు కరువు
- క్రమబద్ధీకరించాలని డిమాండ్

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు (ఓపీఎస్) ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందుల పాలవుతున్నారు. పంచాయతీ సెక్రెటరీలు, జూనియర్ పంచాయతీ సెక్రెటరీలకు సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమానమైన వేతనం అందించడం లేదని నిరుత్సాహానికి గురవుతున్నారు. ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు భరోసా కరువైంది. 2017లో ప్రభుత్వం విడుదల చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి భర్తీ నోటిఫికేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శుల పరీక్ష రాసి మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఎంపికయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ. 10,600 నుంచి రూ. 15,000 వరకు వేతనం మాత్రమే అందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనం ఏ నెలకు ఆ నెల కాకుండా సుమారు నెలలకోసారి ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రంలో 1,096 మంది ఓపీఎస్‌లు...

రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో 1,096 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 28 మంది ఉన్నారు. అయితే ఉద్యోగంలో పని ఒత్తిడి, ఉన్నతాధికారులు వేధింపులు తట్టుకోలేక కొందరు వేరే ఉద్యోగాలు రావడంతో మరికొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న 1,096 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా కన్వర్షన్ చేస్తూ రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది. ఇటీవల జగిత్యాలలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందించడంతో పాటు గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న ఓపీఎస్ కార్యదర్శులు (ఫైల్)

ఏడు నెలలుగా అందని వేతనాలు..

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఓపీఎస్‌లకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. అరకొరగా ఇస్తున్న వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించకపోవడంతో కుటుంబ పోషణ భారమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఓపీఎస్‌లు వాపోతు న్నారు. తమ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఎప్పటి కప్పుడు వేతనాలు చెల్లించాలని ఓపీఎస్‌లు డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు సక్రమంగా అందించాలి
ఎం వినోద్, ఓపీఎస్ కార్యదర్శి, జగిత్యాల



పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు సక్రమంగా అందించాలి. ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటు న్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలను అందించాలి.

జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించాలి
బైరి విద్యాసాగర్, ఓపీఎస్ కార్యదర్శి, జగిత్యాల



రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో జేపీఎస్‌లతో సమానంగా పని చేస్తున్నాం. పైగా ఉద్యోత భద్రత లేక అభద్రతా భావంతో విధులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు ఇప్పటికే పలుమార్లు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతి పత్రాలను అందించాం. ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా వెంటనే క్రమబద్ధీకరించాలి.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

వీసీలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కట్టుదిట్టంగా సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీసీకి కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అవ సరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాలని సూచించారు. ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన నిర్దేశిత మార్గదర్శకాల ప్రకా రం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, ఆర్‌డీఓలు మధుసూ దన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, కలెక్టర్ కార్యాలయ ఏ వో హన్మంత్ రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజలకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలి

ప్రజలకు ఇబ్బంది కలగకుండా డాక్టర్లు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని జనరల్ ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంలో సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లకు బదులుగా వారు సెలవులో ఉన్నప్పుడు మెడికల్ కళాశాలలో ఉన్న ప్రొఫెసర్లను ఎలా కేటాయిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా సెలవులో వెళ్లిన డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకుండా నర్సులు ఎలా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు అని ప్రశ్నించారు. ఎలాంటి సమాచారం లేకుండా దీర్ఘకాలంగా సెలవుల్లో ఉన్న వైద్యులను ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా ఒక వారం రోజులు గైర్హాజరులో ఉంటే మెమో ఇవ్వడంతో పాటు వేతనం కట్ చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమీయోద్దిన్, పలువురు వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జిల్లాలో జ్వర సర్వే నిర్వహించి, రక్త పరీక్షలు అధికంగా చేయడం ద్వారా డెంగ్యూ, చికెన్‌గున్యా, వ్యాధులకు చికిత్స అందిస్తే కొంత మేరకు కాలానుగుణ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునని కలెక్టర్ సత్య ప్రసాద్ అభిప్రాయపడ్డారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీకృత కార్యాలయంలో కలెక్టర్ సమీక్షసమావేశం నిర్వహించారు. చికెన్‌గున్యా కేసులు నమోదవుతున్నందున జ్వరంతో బాధపడుతున్న వారికి నాలుగు రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీపీవో రఘువరన్, డీఎం హెచ్‌వో డాక్టర్ సమియొద్దీన్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, ఎపిడమాలజిస్ట్ వంశీ, శ్రీధర్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, విస్తరణ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

●పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఈనెల 23వ తేదీన ముసాయిదా రెవెన్యూ చట్టం 2024పై అభిప్రాయ సేకరణ, సలహాలు, సూచనల కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

317జీవో బాధితులకు న్యాయం చేయాలి

ప్రభుత్వానికి జిల్లా తపస్ సంఘ విజ్ఞప్తి

జగిత్యాల అర్బన్. ఆగస్టు 20: రాష్ట్రంలోని 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తపస్ జిల్లా బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులచే తపస్ ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదును ప్రారంభించి సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317జీవో ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి బీఈడీ, డీఎడ్ చేసిన సెకండరీ గ్రేడ్ వారితో కామన్ సీనియారిటీతో భర్తీ చేయాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, కేజీబీవీ పాఠశాలలో పనిచేసే వారికి పే స్కేల్ అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలకు వెంటనే జీవో విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు నరేంధర్‌రావు, భోనగిరి దేవయ్య, ప్రధానోపాధ్యాయులు జయమ్మ, శ్రీలత, రజాక్, శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, కుమార్ తదితరులున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో సమీయొద్దిన్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కొడిమ్యాల, ఆగస్టు 20 : ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమియొద్దిన్ అన్నారు. మంగళవారం మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామంలో కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. 20 మంది నుంచి రక్త నమూనాలను వైద్య సిబ్బంది సేకరించారు. సుమారు 80 మందికి మందులను పంపిణీ చేశారు. నంతరం మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో జ్వరాలను గురించి అక్కడి సిబ్బందిని, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టు పక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ వైద్య శిబిరంలో మండల వైద్య అధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ ఎంలు, ఆశావర్కర్లు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వెల్గటూర్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడకల్లో పాల్గొన్న విప్ అడ్లూరి

వెల్గటూర్ ఆగస్టు 20: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాలను యువత కొనసాగించాలని విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విప్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజల కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, గుండాటి జితేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, మురళీ, శ్రీకాంత్‌రావు, సందీప్‌రెడ్డి, వెంకటేష్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ : దేశం కోసం ప్రాణాలర్పించిన మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆశయాలను యువత కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హయాంలో నూతన సంస్కరణలు చేపట్టడం తో పాటు, దేశంలో సాంకేతికను పరిచయం చేశాడని పేర్కొన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, బల్దియా చైర్‌పర్సన్ జ్యోతి, మహిళా కాంగ్రెస్ బాధ్యులు తాటిపర్తి శోభారాణి, పిప్పరి అనిత, నాయకులు గుండ మధు, కల్లెపల్లి దుర్గయ్య, కమటాల శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్, ముఖేష్‌ఖన్నా, లక్ష్మణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధర్మపురిలో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నంది విగ్రహ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి హోదాలో దేశానికి ఆయన చేసిన సేవలు మరవలేమన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షులు రాందేని మొగిలి, శ్రీనివాస్, సుముఖ్, రాపర్తి సాయికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలి

జగిత్యాలరూరల్, ఆగస్టు 20 : బీఎల్‌వో విధుల నుంచి తమకు మినహాయింపు కల్పించాలని కోరుతూ జగిత్యాల రూరల్ మండల పంచాయతీ కార్యదర్శులు మంగళవారం జగిత్యాల రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో రవిబాబును కలిసి వినతి పత్రం అందజేశా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ తమకు బీఎల్‌వో డ్యూటీలు అప్పగించారని గ్రామపంచాయతీల్లో పని ఒత్తిడి దృష్ట్యా తమకు మినహాయింపు కల్పించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. రూరల్ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుగ్గారం : బీఎల్‌వో నిర్వర్తిస్తున్న విధులు తమకొద్దని కార్యదర్శులు మంగళవారం తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న అంగన్ వాడి టీచర్లులను బీఎల్‌వో గా కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. కార్యదర్శులు అక్బర్, సతీష్, భాష్కర్, అమీర్, నవ్య, శైలజ పాల్గొన్నారు.

కొడిమ్యాల: బీఎల్వో విధుల నుంచి తమకు మినహా యింపివ్వాలని కోరుతూ మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు ఎంపీడీవో స్వరూపకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ సానిటేషన్, ఈజీ ఎస్, జ్వర సర్వే, తదితర పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఎలక్షన్‌కు సంబంధించి వచ్చిన పోలింగ్ ఆఫీసర్లను సపోర్ట్ చేస్తూ పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి సమయంలో బీఎల్వో విధులు చేస్తే తప్పులు జరిగే అవకాశాలు ఉన్నందున తమను ఆ విధుల నుంచి మినహాయింపివ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వంశీవర్ధన్, కార్యదర్శులు శేఖర్, మహేష్, తిరుపతి, మధు, ప్రశాంత్, పాల్గొన్నారు.



ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు

● విప్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ ఆగస్టు 20: రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని ప్రతి రైతుకు రుణమాఫీ జరిగేలా చుస్తామని అది తమ బాధ్యత అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ, రెవెన్యూ అధికారులలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ పాల్గొన్నారు. అధికారులతో పలు అంశాలపై చర్చించి వివరాలు అడిగి తెలుసుకోని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విప్ మాటాల్లడుతూ కొన్ని పొరపాట్ల వలన రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం అని విటిని త్వరలోనే పరిష్కరించి వారికి రుణమాఫీ వర్తింప జేస్తాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చారని అన్నారు. రైతు రుణమాఫీ పైన మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలకు, రైతులకు అసత్యాలను చేప్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే బీఆర్ఎస్‌కు మింగుడు పడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీంధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జితేంతర్‌రెడ్డి, తిరుపతి, రమేష్, సందీప్ పాల్గోన్నారు.













కార్పొరేట్ పాఠశాలలో రూ.4.5 లక్షల ఫీజు స్వాహా

సొంత అకౌంట్‌లోకి ఫీజుల బదలాయింపు


గతంలో మరో కార్పొరేట్ పాఠశాలలోనూ ఇదే తరహా ఘటన

కలవర పడుతున్న పోషకులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: గోదావరిఖనిలో మరో కార్పొరేట్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కలిసి విద్యార్థుల ఫీజులు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.4.5లక్షల ఫీజులను సదరు ప్రిన్సిపాల్ వాడుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించేందుకు వచ్చిన పోషకుల నుంచి తమ స్కూల్ అకౌంట్ పని చేయడం లేదని తమ సొంత అకౌంట్‌లలోకి పంపాలంటూ బదలాయించుకున్నట్టు తెలుస్తున్నది. సదరు పాఠశాల యాజమాన్యం మాత్రం ఇప్పుడే తామేమి చెప్పలేమని, అన్నీ విషయాలు పరిశీలన చేస్తున్నామని పేర్కొంటున్నది.

గత సంవత్సరం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలో కూడా ప్రిన్సిపాల్ సుమారు రూ.7లక్షల వరకు విద్యార్థుల ఫీజులతో ఉడాయించిన ఘటన వెలుగు చూసింది. యాజమాన్యం ఆధారాలు చూపిన విద్యార్థుల ఫీజులను మాత్రం సర్దుబాటు చేసుకుంది. ఆధారాలు లేని వారి నుంచి మళ్లీ వసూలు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో ఈ తరహా మోసాలు జరుగడం కలవరపెడుతుంది.





కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్న సన్నిధిలో భక్తులు

మల్యాల, ఆగస్టు 20: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే అంతే..



రామడుగు వాగుపై ఉన్న వంతెనపై పక్కకు ఒరిగిన టిప్పర్

రామడుగు, ఆగస్టు 20: రామడుగు వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు అప్పుడప్పుడు మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు పడి దిగబడుతున్నాయి. మంగళవారం ఓ టిప్పర్ వంతనెన దాటుతూ దిగబడి పక్కకు ఒరిగింది. కొత్త వంతెన పూర్తయినా ప్రారంభించడం లేదు. ఇకనైనా కొత్త వంతెనను ప్రారంభించాలని మండల వాసులు కోరుతున్నారు.

దుబ్బపల్లిలో పేకాట స్థావరంపై దాడి

మంథనిరూరల్, ఆగస్టు 20: మంథని మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మంథని పోలీసులు దాడి చేయగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 3 బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్‌లు, రూ. 20,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

పిగుడుపాటుకు వ్యక్తి మృతి

మంథనిరూరల్, ఆగస్టు 20: మండలంలోని పందులపల్లికి చెందిన ఉడుత నారాయణ(52) సోమవారం రాత్రి పడుగుపాటుతో మృతి చెందినట్లు మంథని ఎస్‌ఐ రమేష్ మంగళవారం తెలిపారు. నారాయణ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పిడుగుపాటు గురై మృతిచెందినట్లు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలతో చేపలను వేటాడిన వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగలను అపహరించి సమీప వాగులో చేపలను వేటాడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచం పర్శరాములపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన వట్టెల రాజు బోరు మోటారు కరెంటు తీగలను ఈ నెల 13న కుంచం పర్శరాములు దొంగిలించి సమీపంలోని వాగులో చేపలు పట్టాడు. విషయం రాజుకు తెలియడంతో విద్యుత్ తీగలను ఇవ్వాలని కుంచం పర్శరాములును కోరగా అందుకు ఆయన బెదిరింపులకు దిగాడు. కరెంటు తీగలను అపహరించడంతో పాటు విద్యుత్‌తో వాగులో చేపలను వేటాడిన కుంచం పర్శరాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు. నీటి వనరుల్లో విద్యుత్ షాక్‌లు పెట్టి ఎవరైనా చేపలు వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కస్టమ్ గోల్డ్ ఉచ్చులో ఖని వ్యాపారులు

రూ.10కోట్లు పోగొట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌లో మోసగాళ్లను పట్టుకున్న పోలీసులు

తలలు పట్టుకుంటున్న రామగుండం వ్యాపారులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: కస్టమ్స్ పట్టుకున్న బంగారం తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు మోసగాళ్లు పన్నిన ఉచ్చులో గోదావరిఖనికి చెందిన వ్యాపారులు పడ్డారు. సమారు రూ.10కోట్లు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారంలో సగం వరకు ప్రభుత్వ లెక్కల్లో చూపరని, దానిని మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు రామగుండం ప్రాంతానికి చెందిన వ్యాపారులతో బేరాలు కుదుర్చుకున్నారు. మొదట తక్కువ మోతాదులో అసలు బంగారం ఇవ్వడంతో నమ్మిన ఈ ప్రాంత వ్యాపారులు తమకు దగ్గర ఉన్న మరికొందరు వ్యాపారులను ఈ దందాలోకి దింపినట్టు తెలుస్తోంది. రెండుమూడు సార్లు ఈ విధంగా ట్రేడింగ్ చేసిన వ్యాపారులు వారికి మధ్యవర్తులుగా మారిపోయారు. దీంతో ఈ గోల్డ్ ట్రేడింగ్‌లో కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. చివరికి హైదరాబాద్ చెందిన వ్యక్తులు మకాం ఎత్తివేసి వ్యాపారులకు దొరకకుండా తప్పించుకుని తిరిగారు. వీరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడంతో ఈ దందా వెలుగు చూసింది. రెండుమూడు స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ నోట్ల కట్టలు, నకిలీ బంగారం బిస్కెట్లను ఎరగా చూపి గోదావరిఖనికి చెందిన వ్యక్తుల నుంచి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇంట్లోని బంగారం, ప్లాట్లు, ఆస్తులు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులు కూడా పెట్టుబడి పెట్టారని చర్చ జరుగుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 20: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 11,427 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 16.4 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 5,261 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3150, మానేరు, మూలవాగు ద్వారా 2,111 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.21 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం మంగళ వారం కొంత పెరిగింది. ఎస్సారెస్పీలోకి 14,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 50.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కళాశాల బోధనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, ఆగస్టు 20 : కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, సౌకర్యాలను విపులంగా వివరించారు. సాంకేతిక విద్యా బోధన, పరీక్షల నిబంధనలు విద్యార్థులకు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న వసతులను తెలిపారు. కళాశాలలో విద్యార్థులు పాటించాలిసిన విధానాలను, తల్లిదండ్రుల బాధ్యతలను వివరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ విభాగాల అధిపతులను విద్యార్థుల తల్లిదండ్రులకు పరిచయం చేశారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా.. కె. శ్రీనివాస్, డా.. బి. సతీష్‌కుమార్, డా.. ఎస్. సురేష్‌కుమార్, డా.. వై. రాజశేఖర్‌రెడ్డి, డా.. సురేష్‌అర్షుల్లా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్ రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



నేరెళ్ల శారదకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 20: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావిం చగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదం అందజేసి శేషవస్త్రం కప్పి సన్మానిం చారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కొండ గట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో వచ్చిన చైర్‌పర్సన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్క రిం చారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. చైర్‌పర్సన్ వెంట ఆలయ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



కొండగట్టులో పూర్ణకుంభంతో స్వాగతం పలుకతున్న అర్చకులు

శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరపాలి



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

- నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలి
- తెలంగాణలో మావోయిస్టులు లేరు
- డీజీపీ జితేందర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 : కేసుల విచారణ శాస్త్రీయ పద్ధతిలో జరపాలని, నేర ఘటనలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో డీజీపీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కేసులు ట్రయల్స్‌కు వచ్చిన సమయంలో కేసు తీవ్రతను బట్టి అవసరమైతే డీఎస్పీలు సైతం కోర్టుకు వెళ్లి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వ్యవరించాలన్నారు. సీసీ కెమెరాలు నేర పరిశోధన, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు వాటి ప్రాముఖ్యతను తెలిపి అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డీఎస్పీ, సీఐలు, డివిజన్, సర్కిల్ వారీగా శాంతి భద్రతల సమస్యలను అధిగమించేందుకు కార్యచరణ కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేశారు. మతపరమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సమీక్షా సమావేశానికి కరీంనగర్ కమిషనరేట్ కు వచ్చిన డీజీపీ డాక్టర్ జితేందర్‌కు మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల చేత డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమీ షనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మూడు జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడమే తమ లక్ష్యమని, దాని కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకుంటూనే అక్రమ ఇసుక రవాణా, సైబర్ నేరాలు, డ్రగ్స్ కంట్రోల్, గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై డేగ కన్నేసినట్లు తెలిపారు. భూకబ్జాలను అరికట్టడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు వస్తున్న సమాచారం మేరకు అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో సిబ్బంది కొరతను పూర్తిగా అధిగమిస్తామని అన్నారు. 13 వేల మంది ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని, రెండు, మూడు నెలల్లో విధుల్లో చేరుతారని డీజీపీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారి కదలికలపై ఆరా తీస్తున్నామన్నారు.

తెలంగాణలో గంజాయి ఉత్పత్తి లేదని, ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి సరఫరా అవుతుందన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, ఇతర రాష్ట్రాలకు పారిపోయారన్నారు. సైబర్ క్రైం బ్యూరోను దేశంలో తెలంగాణలోనే మొదటగా ఏర్పాటు చేసి 85 కోట్ల రూపాయలు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో కోటి 60 లక్షలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నవారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే నిమిషాలలో ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసి ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులను వెనక్కి తీసుకువస్తామన్నారు. నార్కోటిక్ బ్యూరోను కూడా సీనియర్ అధికారులతో ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ చాలా స్ట్రిక్ట్ ఆఫీసనే విషయం తెలుసుకదా... ఈడబ్బ్యూ కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ రేంజ్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఐపీఎస్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మూడు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు

బీసీ గణన తర్వాతనే

'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి..

పెద్దపల్లి బీసీ సదస్సులో నాయకుల డిమాండ్..

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ గణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజూరి శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి బీసీ సదస్సును నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో బీసీ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదస్సుకు హాజరైన వారినుద్దేశించి సదరు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్ష చూపుతున్నదని, దీనిని ఖండిస్తున్నామన్నారు. పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడిన విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఓబీసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించారు.


స్వాతం త్రం వచ్చినప్పటి నుంచి నేటికీ బీసీ గణన జరగ లేదని పేర్కొన్నారు. భారతదేశాన్ని పాలించిన తెల్ల దొరలు ఓబీసీ గణన చేశారే తప్ప స్వతంత్ర భారతదేశంలో బీసీ గణనకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనగణన చేస్తామని మాట ఇచ్చి కేబినెట్‌లో తీర్మానం చేసిందే తప్ప ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టలేదన్నారు. బీసీ గణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నదని, బీసీ గణన చేపట్టే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని అన్నారు. బీసీల తలరాతలు మారాలంటే వెంటనే బీసీ గణన చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, మాజీ జడ్పీటీసీలు గంటా రాములు యాదవ్, కందుల సంధ్యారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీసీ నాయకులు బండారు శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మారం తిరుపతి యాదవ్, శిలారపు పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టా శైలజ, మాజీ జడ్పీటీసీ సంపత్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, పడాల రవీందర్ గౌడ్, చంద్రమౌళి, పొట్యాల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బీసీ నాయకులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 20: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో అప్పులబాధతో కౌలు రైతు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన వేముల మల్లేశం (40) మూడు సార్లు గల్ఫ్ వెళ్లి అక్కడ సరైన ఉపాధి దొరకక తిరిగి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక స్థానికంగా ఐదెక రాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరినాటు వేశాడు. గల్ఫ్ అప్పులు, సాగు కోసం చేసిన అప్పులు ఐదు లక్షల రూపాయలు తీర్చే మార్గం లేక అప్పుల బాధతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మల్లేశంకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎస్సై సీహెచ్ గణేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గేదెపై వీధి కుక్కల దాడి

తిమ్మాపూర్, ఆగస్టు 20: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వీధి కుక్కలు వీరంగం వేశాయి. ఎల్ఎండీ కాలనీలోని చిందం రాజు అనే రైతు తన గేదె ను తన ఇంటి పక్కన ఉన్న తన పశువులను కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో కొన్ని వీధి కుక్కలు పశువులపై దాడి చేసి అందులో ఉన్న గేదెను హత మార్చాయి. అక్కడ ఉన్న మిగతా పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించాయి. చప్పుడు వినిపించి నిద్ర లేచిన రైతు రాజు కుక్కలను అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. మృతి చెందిన గేదె విలువ 20వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రాజు కోరాడు.

విద్యుత్‌షాక్ తో గేదె మృతి

జగిత్యాలరూరల్,ఆగస్టు 20: మండలంలోని నర్సింగాపూర్ కు చెందిన గడ్డం మల్లయ్యకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెం ది నట్లు నర్సింగాపూర్ గ్రామస్థులు తెలిపారు. సోమవారం అదే గ్రామానికి చెందిన మద్దెల లచ్చన్నకు చెందిన గేదె మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చేనేత టెక్నాలజీ కోర్సులకు పిల్లలను పంపించాలి

టేస్కో జీఎం అశోక్‌రావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న టేస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20 : తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా మంజూరైన ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హాండ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో పిల్లలను చేర్పించేందుకు నేతన్నలు తమ పిల్లలను పంపించాలని టేస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యాడ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లపై నేతన్నలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడరు. రాష్ట్రానికి మంజూరైన దీనిలో మొదటి సంవత్సరం కోర్సులలో చదువుతోపాటు నేర్చుకునేందుకు 60 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

ఇందులో నేర్చుకునే వారికి ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకునేలా నేతన్నలు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఇందులో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండడంతో పాటు 01-07-2024 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 23 సంవత్సరాలు కలిగి ఉండాలని అలాగే షెడ్యూల్ కులాలకు చెందిన వారైతే 25 సంవత్సరాలు ఉన్నవారి అనుమతులు ఉంటాయన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పూర్తి వివరాల కోసం బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్‌ల యాజమానులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న యాజమానులు, ఆసాములు

రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20: రాష్ట్ర పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. ఈనెల 17,18వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగిన తెలంగాణ అండర్- 23 పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని వివిధ అంశాలలో పతకాలను సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. మహిళల లాంగ్ జంప్‌లో సిహెచ్ పూజ బంగారు పతకం, వంద మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. యం వినయ్ 3వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, 100మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. ఇ.విష్ణువర్ధన్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం, కె.వైష్ణవి 400మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 2వందల మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎస్ అజయ్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో రజత పతకం, కె.రవి 800మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎ సంతోష్ 3వేల మీటర్ల స్ట్రీపుల్ చేస్‌లో రజత పతకం, ఎ వివేకానంద ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, కె స్వామి జావలెన్ త్రోలో రజత పతకం, డి. మాలుపతి 100మీటర్ల పరుగులో రజత పతకం సాధించి అండర్ 23 సంవత్సర విభాగంలో చాంపియన్‌లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా కారులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతి లను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, డివైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు బి.రాజగోపాలచారి, కటకం రవి, హరికిషన్, సుమన్ కళ్యాణ్, రమేష్, బిషన్‌సింగ్, కార్యదర్శి కడారి రవి అభినందించారు.



పతకాలు సాధించిన అథ్లెటిక్స్

రుణమాఫీ చేయాలంటూ రోడ్డెక్కిన అన్నదాతలు


మెట్‌పల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు


కథలాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు


అంబారిపేట రైతువేదిక ఎదుట రైతుల రాస్తారోకో

●పలు ప్రాంతాల్లో రైతుల ఆందోళనలు

●స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదలమంటూ బైఠాయింపు

మెట్‌పల్లి, ఆగస్టు 20(ఇబ్రహీంపట్నం): రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదంటూ రైతులు భీష్మించుకుని రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన రైతులు రుణమాఫీపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీల పెడుతోందని ఆరోపించారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని లేదంటే ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. గంటసేపు బైఠాయించడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆందోళన విరమించాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి రైతు నాయకులను, రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా వినలేదు. ఒక దశలో రైతులు బస్సులకు అడ్డంగా పడుకున్నారు. జిల్లా వ్యవసాయధికారి వాణి, మెట్ పల్లి ఏడీఏ లావణ్య, ఏవో దీపిక రైతుల వద్దకు చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. సాంకేతిక సమస్య వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని అర్హులకు రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని తెలుపడంతో రైతులు శాంతించి ఆందోళనను విరమించారు.

అంబారిపేటలో రైతుల రాస్తారోకో

జగిత్యాలరూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ అర్హత కలిగిన రైతులకు అందడంలేదని ఆరోపిస్తూ జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట రైతువేదిక ముందు మంగళవారం రైతువేదిక క్లస్టర్ పరిధిలోని 5 గ్రామాల రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ అంబారిపేట గ్రామంలో సుమారు 60శాతం రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. బ్యాంకుల చుట్టూ తిప్పించుకోవడమే తప్ప అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నారు. అర్హత ఉన్నా రైతులకు రుణమాఫీ కాలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు అరగంటపాటు రైతులు ధర్నా నిర్వహించగా, సమాచారం అందుకున్న జగిత్యాల పట్టణ పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని రైతులకు నచ్చ జెప్పడంతో రాస్తారోకో విరమించారు.

● మండల వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు

మల్యాల: రైతులకు ప్రభుత్వం ఇటీవల మాఫీ చేసిన రూ.2లక్షల రుణ మాఫీపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీకి సంబంధించి ఎలాంటి సమాచారం తమకు అందలేదంటూ మండల వ్యవసాయ కార్యాలయం వద్దకు తరలివస్తున్నారు. మంగళవారం రైతులు అధిక సంఖ్యలో వచ్చి ఏవో చంద్రదీపక్ ఏఈవోలను సంప్రదించారు. రుణమాఫీ గురించి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో రైతులు చెల్లించాల్సిన రెండు లక్షలు ఆపై రుణంపై ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు వేచి ఉండాలని అధికారులు సూచించారు. దీనిపై రైతుల్లో అయోమయం నెలకొంది.

● ప్రతి మంగళవారం రైతులతో నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతు రుణమాఫీపై వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ గోపితో రైతులు తమ సమస్యలను వివరించారు. స్పందించిన అధికారులు రుణమాఫీపై ప్రత్యేక యాప్ రానుందని తెలిపారు. అంతవరకు గ్రీవెన్స్‌సెల్ ద్వారా రైతులు సమస్యల ఫిర్యాదులు తీసుకోవాలని యాప్ రాగానే అందులో నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణి, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు

కథలాపూర్‌లో రాస్తారోకో..

కథలాపూర్ : కాంగ్రెస్ సర్కారు రైతు రుణమాఫీపై గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చ లేదని ఆరోపిస్తూ మంగళవారం మండల కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో సుమారు గంటన్నర సేపు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని రైతులను నమ్మించి మోసగించారని ఆరోపించారు. రు. 2లక్షల రుణమాఫీ కనీసం సగం మంది రైతులకు కూడా చేయక చేతులెత్తేశారని అన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను రైతులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. అనంతరం వేములవాడ - కోరుట్ల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. కోరుట్ల సీఐ సురేశ్, కథలాపూర్, కోరుట్ల ఎస్సైలు నవీన్, శ్వేత, శ్యాంరాజ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

రుణమాఫీ కాలేదని రైతు దీక్ష..

పండ్ల రసం ఇచ్చి విరమింపజేసిన అధికారులు

మల్లాపూర్ : ప్రభుత్వం అందజేస్తున్న రుణమాఫీ పథకంలో నెలకొన్న సాంకేతిక లోపాలను సరిచేసి అర్హులైన వారికి మాఫీ చేస్తామని మండల వ్యవసాధికారి లావణ్య పేర్కొన్నారు. మండలంలోని రాఘవపేట గ్రామంలో తన భార్య పేరున రూ. 1,21వేలు రుణమాఫీ కాలేదని సోము శ్రీనివాస్ మంగళవారం దీక్ష చేపట్టాడు.

విషయం తెలుసుకున్న వ్యవసాధికారి లావణ్య, ఎస్సై కిరణ్‌కు మార్, రెవెన్యూ అధికారులు రైతు ఇంటికి వెళ్లి సాంకేతిక లోపాలు సరిచే యగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. దీంతో అధికారులు రైతుకు పండ్ల రసం అందజేసి విరమింప జేసారు.

సంక్షిప్తం సమాచారం

జగిత్యాలరూరల్ : జగిత్యాల జిల్లా డీఎస్‌వో చందన్‌కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతడి స్థానంలో సిరిసిల్ల జిల్లాలో డీఎస్ఓగా పనిచేస్తున్న జితేందర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర సివిల్‌సప్లై కమిష నర్ చౌహాన్ మంగళవారం ఉత్వర్వులు జారీ చేశారు. అలాగే సివిల్‌సప్లై డీఎంగా పనిచేస్తున్న రజితను సిరి సిల్లకు బదిలీ చేయగా, రజితస్థానంలో సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న ఏజీ జితేంద్రప్రసాద్‌ను జగిత్యాల సివి ల్ సప్లై డీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొడిమ్యాల : మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వానా కాలం వరి పంటలో సాగు విదానం, చీడ పురుగుల నివారణ, ఎరువుల యాజ మాన్యం, వరి పంట సాగులో మెళకువలు తదితర అంశాలపై రైతులకు వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్ర వేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిపించారు.

●రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

●కొడిమ్యాల మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మంగళవారం వెలుగందుల అంజయ్యను డీలర్లు ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏలేటి కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా లంక తిరుపతి, ప్రధానకార్యదర్శిగా వడ్లకొండ హన్మం డ్లు, కోశాధికారిగా మదు పద్మజారాణిని మండలంలోని డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

●ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

మల్యాల: ఎస్సీ వర్గీకరణపై న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుకు వ్యతిరేఖంగా బుధవారం నిర్వ హిస్తున్న భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా మండ లంలో బంద్ విజయవంతం చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు జవ్వాజి శంకర్ కోరారు. స్వామి, రాజలింగం, శేషికుమార్, చుక్కయ్య పాల్గొన్నారు

జగిత్యాల అర్బన్: జిల్లాలో వివిధ రంగాల్లో ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ టెక్నాలజీతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన 6నుంచి 18 సంవత్స రాల బాలబాలికలకు 2024-25 సంవత్సరానికి గానూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ తెలిపారు. 9885497287 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కోరుట్ల : మున్సిపల్ పరిధిలో నిర్వహించిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే చెల్లించాలని బల్దియా కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందించారు.

భీమారం: మండలంలో 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ గోలి రవికిరణ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భీమారం మండల పరిధిలో 20 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, పోలింగ్‌బూత్ వారీగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాల గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపణ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆత్మకూర్ తాళ్ల మండలంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామాల్లోని భక్తులు బోనాల పండుగను జరిపారు. ఆలయంలో నూతన ఉత్యవ మూర్తులకు గౌడ సంఘం ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

మల్లాపూర్ : .ఓటర్ జాబితతతో అక్టోబరు నేల 18 వరకు ఇంటింటి సర్వే జరపాలని తహసీల్దార్ వీర్ సింగ్ సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్ నిర్వహించిన సమావేశంలో బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

పెగడపల్లి: ఎరువులు, పురుగు మందులు దుకాణదారులు వ్యవసాయశాఖ నిబంధనలకు లోబడి విక్రయాలు జరపాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లి, కీచులాటపల్లి గ్రామాలలో గల ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాదికారి వాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

జగిత్యాల అర్బన్ : దేశ అత్యున్నతన్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న దళిత సంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో బంద్ నేపథ్యమై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత్ బంద్‌కు మద్దతుగా జిల్లాలో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంద్‌కు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్. ఆగస్టు 20:జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో స్వీపర్ కం స్కావెంజర్ పోస్టు, కండ్లపల్లి మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో ఏఎన్ఎం(1), హెడ్‌కుక్(1) పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. ఈ దరఖాస్తులను పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లో గల కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. కేజీబీవీలోని స్వీపర్ కం స్కావెంజర్ పోస్టుకు ఏడవ తరగతి మెమో, అనుభవం కలిగి ఉండాలని, కండ్లపల్లి మోడల్ స్కూల్ హాస్టల్ ఏఎన్ఎం పోస్టుకు అర్హత ఇంటర్ తోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ ఏఎన్ఎం ట్రైనింగ్, ఆర్‌జీఎన్ఎమ్ ట్రైనింగ్, హెడ్‌కుక్‌కు ఎస్సెస్సీ ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్‌కు ఏడవ తరగతి ఉత్తీర్ణత చదవి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లను జతచేసి ధరూర్ క్యాంప్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మధులత, 8522080903 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి బాలికల హాస్టల్ నందు పనిచేయుటకోసం ఏఎన్ఎం, వంట సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జగిత్యాల మండల విద్యాధికారి గాయత్రి తెలిపారు. కండ్లపల్లి హాస్టల్ నందు హెడ్‌కుక్, రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అనుభవం కలిగిన మహిళలు ఈనెల 23 తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల కస్తూరిబాగాంధీ విద్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. వివరాలకు హాస్టల్ ఇన్‌చార్జి మధులత 8522080903 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి, ఆగస్టు 20(ఇబ్రహీంపట్నం): ప్రస్తుత వానకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతవారణంలో మార్పుల కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటు వ్యాధులు ప్రబలకుండ తగిన జాగ్రత్తలు చేపట్టాలని అదేశించారు.

సత్యసాయి ట్రస్ట్ చేయూత

జగిత్యాల అర్బన్, ఆగస్టు 20 : జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కాశవ్వ, రూరల్ మండలం పొలాసకు చెందిన రక్షిత అనే ఇద్దరు యువతులకు వివాహం నిశ్చయం కాగా, వీరిరివురికి సత్యసాయి ట్రస్ట్ జగిత్యాల వారు అండగా నిలిచి తమ ఔదార్యం చాటుకున్నారు. భక్తులందరి సహకారంతో అమ్మాయిల వివాహానికి అవసరమైన వస్తువులు, మంగళసూత్రం, మెట్టెలు, పెళ్లిచీరతో పాటు 25కేజీల బియ్యం అందించారు. సంస్థ బాధ్యులు బట్టు రాజేందర్, లక్ష్మీనారాయణ, మురళీధర్‌రావు, భాస్కర్, సుధాకర్, రాజశేఖర్, జయశ్రీ, శ్రీలత, రజిత, పద్మ, ప్రీతి, లక్ష్మీ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 20: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మస్కిటో డేను నిర్వహించి, దోమల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరి స్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంగీత. నీరజ, చంద్రయ్య, ప్రమోద్‌కుమార్, వరప్రసాద్, వాసవి, రామచంద్రన్, సుజాత, మల్లిఖార్జున్ తో పాటు విద్యార్థులున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మల్లాపూర్, ఆగస్టు 20 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం దోమల దినోత్సవం సందర్భంగా మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలోని రికార్డులు, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రామోహన్, సీహెచ్‌వో వేణురావు, పీహెచ్ఎన్ ప్రభావతి, సూపర్ వైజర్ మహేశ్వరి, ఫార్మసిస్ట్ ఉమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ సుమ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవు

కోరుట్ల, ఆగస్టు 19 : నిషేదిత ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తిరుపతి దుకాణ దారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పలు దుకాణాలలో దాడులను నిర్వహించారు. దుకాణాలలో నిలువ ఉన్న 75 మైక్రాన్ కన్న తక్కువగా ఉన్న పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకోని జరిమానాలు విధించారు. ఒక్కొక్క దుకాణంకు రూ. 3000 జరిమానాలను విధించారు. ఈ కార్యక్రమంలో సనిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే ఆశోక్, జూనియర్ అసిస్టెంట్ ఆకు ఆంజయ్య, వార్డు అధికారులు ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమరసతా సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 20 : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో సెప్టెంబరు 1న నిర్వహించే సమరసతా సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. మంగళవారం సమ్మేళన కార్యక్రమనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, రాష్ట్ర మహిళ కన్వీనర్ సామాజిక సమరసతా వేదిక రుక్మిణీ, అప్పల ప్రసాద్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. సమ్మేళన కార్యక్రమంలో కుల మత వర్గ భేదం లేకుండా ప్రజలంధరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరించిలో పాల్గొన్న వారిలో నాయకులు బెజ్జారపు మురళి, పోహర్ తుకారాం, మజ్జి భాస్కర్, తోపారపు నాగయ్య, కొల్లెపు శ్రీనివాస్, గుంటుక గంగాధర్, పోతు లక్ష్మణ్, తోపారపు రాజేందర్, అడ్డగట్ల నర్సయ్య, మ్యాడం గోపి, పెండెం శివానంద్, సజ్జనపు కృష్ణానంద్, దేశరాజు దేవలింగం, వడ్డేపల్లి చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

25న వాల్మీకి ఆవాస నూతన భవనం ప్రారంభం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 20 : సేవా భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని గీతా విద్యాలయం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం నూతన భవనం ప్రారంభో త్సవం ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్, ఆవాస భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భీమ నాతి శంకర్ తెలిపారు. ఈ మేరకు భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యుల చేతులమీదుగా ఆవిష్కరించారు.

32 ఏళ్లుగా నిరు పేద నిరాశ్రయుల బాలల కోసం ఈ ఆవాసాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా, స్థానిక జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు ప్రముఖులు అతిథు లుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాస అధ్యక్ష, కార్యదర్శులు జిడిగె పురు షోత్తం, మదన్‌మోహ న్‌రావు, కమిటీ సభ్యులు అశోక్ రావు, సంపూ ర్ణచారి, టీవీ సూర్యం, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, హరీష్, నర్సింగారావు, కైలాసం, సురేష్, ఆవాస ప్రముఖ్ మల్లేశం తదితరులున్నారు.

జిల్లాలో పలువురు ఆర్ఐల బదిలీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 20 : జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఆర్‌ఐలను బదిలీ చేస్తూ కలెక్టర్ సత్య ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కోరుట్ల ఆర్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్న రంజిత్‌ను భీమారం తహసీల్దార్ కార్యాలయానికి, ధర్మపురిలో పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను జగిత్యాల డీఎస్‌వో కార్యాలయానికి, జగిత్యాలలో పనిచేస్తున్న మహేశ్వర్‌రావును కొడిమ్యాలకు, కొడిమ్యాలలో పనిచేస్తున్న చంద్రికను జగిత్యాల అర్బన్ కార్యాలయానికి, జగిత్యాల అర్బన్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అనూషను గొల్లపల్లికి, గొల్లపల్లిలో పని చేస్తున్న అమేర్ సోహేల్‌ను కథలాపూర్‌కు, అక్కడ పనిచేస్తున్న స్వామిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న అమ్మేర్ సమ్మాద్‌ను కోరుట్లకు, మల్యాలలో పనిచేస్తున్న వినయ్‌ను జగిత్యాల అర్బన్ కార్యాలయానికి, జగిత్యాల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తు న్న రాజేందర్‌రావును మెట్‌పల్లి డీఎస్‌వో కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే జగిత్యాల డీఎస్‌వో కార్యాలయంలో పని చేస్తున్న శ్రీనివాస్ యాదవ్‌ను మల్యాలకు, కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆశ్రియనాజ్‌ను బుగ్గారానికి, అక్కడ పనిచేస్తున్న ప్రణీత్‌ను జగిత్యాల కలెక్టర్ కార్యాలయానికి, జగిత్యాల ఆర్‌డీవో కార్యాల యంలో పనిచేస్తున్న రవిబాబును ఎండపల్లికి, జగిత్యాల కలెక్టర్‌కార్యాలయంలో పనిచేస్తున్న రియాజుద్దీన్‌ను బీర్‌పూర్‌కు, జగిత్యాల అర్బన్‌కార్యాలయంలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను భీమారానికి, ఇబ్రహీంపట్నంలో పని చేస్తున్న అనురాధను జగిత్యాల అర్బన్ కార్యాలయానికి, మల్లాపూర్‌లో పని చేస్తున్న షైపాల్‌ను జగిత్యాల కలెక్టర్ కార్యాలయానికి, వెల్గటూర్‌లో పనిచేస్తున్న అన్వేష్‌ను ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


ప్రత్యేక పూజలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఆగస్టు 19 : పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో నూతనంగా ప్రతిష్ఠాపన మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. మంగళవారం దేవాలయంలో లక్ష్మీదేవి, విష్వక్సేన, ఆంజనేయ, రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితులు చక్రపాణి మాధవాచార్య, చక్రపాణి నరసింహమూర్తి, బీర్నంది నరసింహాచారి మంత్రోత్సరణ మధ్య ప్రారంభం అయ్యాయి. పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి విగ్రహాల శోభాయాత్రను జరిపారు. అనంతరం ఆలయ ప్రవేశం, పుణ్యాహవాచనం, హోమం జరిపారు. ద్వాదశ కలశస్నపనం, అభిషేకం, జలాధివాసంను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్లు ఎంబేరీ నాగభూషణం, జిందం లక్ష్మీనారాయణ, పుప్పాల ఉమాదేవి - ప్రభాకర్, మాజీ కౌన్సిరల్ సేన్నపతి రాజు, వివిధ పార్టీల నాయకులు కొత్త సురేష్, ఇందూరి సత్యం, జక్కుల ప్రసాద్, ఎతిరాజం నర్సయ్య, సరిపురం గంగాధర్, ఎంబేరి సత్యనారాయణ, మచ్చ కవిత, మ్యాకల నర్సయ్య, తిరుమల గంగాధర్,కొంత రాజంలు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్యలతో పాటువ భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు


కోరుట్లలో రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మెట్‌పల్లిలో నివాళులు అర్పిస్తున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఆగస్టు 19 : దేశ ప్రదానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవలేనివని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కృష్ణారావు మాట్లాడారు. దేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగంలో రాణించే విధంగా చర్యలు చేపట్టి వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోగ్రభీ, రాజం, మహిపాల్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్ గౌడ్, భూమయ్య, అజయ్, శంకర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంపేట రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేంధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్, రాంప్రసాద్, మారుతి, ప్రదీప్, పాల్గొన్నారు.

కథలాపూర్ : రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఉన్న సమయంలో సాంకేతిక విప్లవం తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, లింగంగౌడ్, దేవన్న, చారి, శ్రీహరి, రవి, సత్యనారాయణ ఉన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్, రాజేశ్వర్, పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరటి మల్లేశం, ఉరుమడ్ల లక్ష్మణ్, తోకల నర్సయ్య, పుప్పాల కొమురయ్య, కిషన్ గౌడ్, గణేష్, బూరం అరుణ్ కుమార్, సంజీవ్, ప్రశాంత్, గంగాధర్ గౌడ్, పెద్దిరెడ్డి స్వామిరెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు విజయభాస్కర్, రాజు, తిరుపతి, రవినాయక్, కిషన్, మహేష్, కొమురయ్య, ప్రశాంత్, శేఖర్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.

మల్యాల : రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మల్యాలలోని సోనియా గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, విండో చైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నెరెళ్ల సతీష్‌రెడ్డి, కట్కం వినయ్, మల్లయ్య, నరసింహారెడ్డి, ప్రవీణ్, ఇమామ్, తిరుపతి, బాబు, బోగ రాజు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జమాలుపూరి రాజేందర్, స్వామి, రాఘవరెడ్డి, గంగయ్య, నర్సయ్య, ప్రసాద్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.